క్లుప్తంగా

10న మండల సర్వ సభ్య సమావేశం

తొట్టంబేడు(శ్రీకాళహస్తిరూరల్): మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులందరూ హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రికి ప్రశంసా పత్రం



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న వైద్యాధికారి మాధవి

బుచ్చినాయుడుకండ్రిగ: రోగులకు అత్యుత్తమ సేవలు అందించినందుకు స్థానిక ప్రభుత్వాస్పత్రికి సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ప్రశంసా పత్రం అందజేశారు. వైద్యాధికారి మాధవిని అభినందించారు. ఇక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలపై నేషనల్ క్వాలిటీ ఆస్యూరెన్స్ ప్రతినిధులు పరిశీలించారు. అత్యుత్తమ సేవలు అందుతున్నట్టు గుర్తించి ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. జిల్లాలోనే ఉత్తమ ప్రభుత్వాస్పత్రిగా గుర్తింపు రావడం సంతోషంగా ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. జిల్లా వైద్యాధికారి శ్రీహరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు

ఏర్పేడు: టీవీ విడి భాగాల చోరీ ఘటనలో గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి సోమవారం తెలిపారు. శనివారం రాత్రి మండలంలోని డిక్సన్ కర్మాగారం నుంచి బెంగళూరుకు వెళ్లేందుకు లారీలో టీవీ విడిభాగాలను లోడ్డు చేసి పక్కనే ఉన్న రోడ్డుపై ఉంచి, డ్రైవర్ నిద్రించాడు. గుర్తుతెలియని వ్యక్తులు లారీ తలుపులు పగులగొట్టి అందులోని కొన్ని టీవీ విడి భాగాలను చోరీ చేసినట్లు చెప్పారు. ఉదయం డ్రైవర్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.


నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న రఘురామయ్య

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి సూళ్లూరుపేటకు చెందిన కె.రఘురామయ్య సోమవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయ స్వామివారికి విశేష పూజలు



అభిషేకం చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న మృత్యుంజయస్వామి వారికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంతో అభిషేకం చేశారు. అనంతరం సుగంధభరిత పుష్పాలు, గజమాల, వెండి నాగాభరణంతో మృత్యుంజయ స్వామివారికి విశేషాలంకరణ చేశారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళహారతులిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ ప్రవీణ్

ఏర్పేడు: మండలంలోని డేవిడ్‌లూయిస్ ఆస్పత్రిలో సోమవారం జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఏర్పేడు, సీతారాంపేట, నచ్చనేరి, నాగంపల్లె, చిందేపల్లె, పంగూరు, అముదూరు, కృష్ణంపల్లె తదతర గ్రామాల నుంచి వచ్చిన 300 మంది రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడిషనల్ డైరెక్టర్ ప్రవీణ్, డాక్టర్లు రజనీ, సందీప్, జీవన్, అల్బర్ట్ మోజస్ పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- సమష్టిగా పనిచేయాలని పిలుపు



బుచ్చినాయుడుకండ్రిగ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్ సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. ఆయన సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో 7,200 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వారంతా శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డికి ఓటు వేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్యాభివృద్ధికి ప్రవేశ పెట్టిన పథకాలను ఓటర్లకు వివరించాలన్నారు. గ్రామాల వారిగా పర్యటించి ఓటర్ల గుర్తించి, వారు మొదటి ప్రాధాన్యం ఓటును పార్టీ తరపున పోటి చేసే అభ్యర్థికి వేసేలా చైతన్యపరచాలని సూచించారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలిసి చంద్రశేఖర్‌రెడ్డికి వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరనాథరెడ్డి, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ వేలూరు రాకేష్, పరిశీలకులు రమణారెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శులు జొన్నల గోపాల్‌రెడ్డి, ఉగ్గుమూడి గురునాథం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలవండి

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి ఓటు వేసి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. ఆయన సోమవారం సంతవేలూరు, వరదయ్యపాళెం, సీఎల్ఎన్‌పల్లి హైస్కూళ్లలో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం వరదయ్యపాళెం కేబీజీ కల్యాణ మండపంలో పార్టీ ముఖ్య నేతలు, పట్టభద్రులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో అందరూ సమన్వయంతో పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నియోజకవర్గ పరిశీలకులు దువ్వూరు రమణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ చిన్నా, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్ బాబు, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, మైనారిటీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

మండలంలోని సీఎల్ఎన్‌పల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎర్ర ఛటర్జీ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేలు అందజేశారు. మిగిలిన సొమ్మును త్వరలోనే అందజేస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు.

ముమ్మర ప్రచారం

సత్యవేడు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని, పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే.సునీల్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం నాయకులతో కలిసి కొత్తమారికుప్పం, నరసరాజు అగ్రహారం, కాళమనాయుడుపేట, చిన్న ఈటిపాకం, పెద్ద ఈటిపాకం, దాసుకుప్పం, ఏఎం పురం, అల్లపుగుంట కన్నావరం పంచాయతీల్లో ప్రచారం చేశారు. మాస్టర్ స్కూల్ చైర్మన్, సచివాలయ మండల కన్వీనర్ బి.సోమశేఖర్, గోవిందస్వామి, ఎంపీటీసీలు మోహన్ రెడ్డి, కే.బాలయ్య, సర్పంచులు బాలాజీ, టి.జయ, మున్స్వామి పాల్గొన్నారు.

పేర్నాటికి మద్దతుగా ప్రచారం

నారాయణవనం: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. వారు సోమవారం నారాయణవనంలో ప్రచారం చేశారు. పట్టభద్రులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలు అందజేశారు. జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను చూసి మొదటి ప్రాధాన్యత ఓటును పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బాబు, సర్పంచ్ సాయిరవి, కో ఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, నాయకులు చిన్నదొరై, సొరకాయలు, గురుస్వామి, శంకరయ్య, మనోహర్, మోహన్, మొహిద్దీన్, బాల, కన్నెప్పరెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

శ్రీకాళహస్తి రూరల్: ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. కాపుగున్నేరిలో మాజీ సర్పంచ్ సిద్దాగుంట శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బావులూరు అంకయ్య, కాపుగున్నేరి సచివాలయం కన్వీనర్లు మధు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు ఉమ్మడిగా వెళ్లి ప్రచారం చేశారు. అలాగే మన్నవరం గ్రామంలో చెంచయ్యానాయుడు, నాగేశ్వరావు నాయుడు, వెలంపాడు గ్రామంలో రఘునాయుడు, భీమవరం గ్రామంలో చిన్నమనాయుడు, చలపతి, శివకుమార్, యల్లంపల్లెలో శంకర్, బీవీపురంలో బిళ్ల చంద్రబాబుయాదవ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అలాగే వేడాం సచివాలయం పరిధిలో కన్వీనర్లు శివకుమార్, బాలిరెడ్డి, అక్కుర్తిలో స్థా నిక సర్పంచ్ కృష్ణయ్య, ప్రభాకర్, శంకర్‌రెడ్డి, హరనాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఇలా ప్రతి గ్రామంలో ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు.



నారాయణవనంలో ప్రచారం చేస్తున్న నాయకులు



తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : ప్రచారం చేస్తున్న వెంగళరావు

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ మండల ఇన్‌చార్జి కేతినేని వెంగళరావు కోరారు. సోమవారం మండలంలోని గుండెలుగుంట, చేమూరు, చియ్యవరం గ్రామాల్లో అభ్యర్థి కరపత్రాలతో జోరుగా ప్రచారం నిర్వహించారు. అశోక్, తీర్థరామన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఏర్పేడు పంచాయతీలో ప్రచారం

ఏర్పేడు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య కోరారు. సోమవారం ఏర్పేడు పంచాయతీలోని పల్లివీధి, శ్రీనివాసనగర్, బజారువీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి పేర్నాటిని గెలిపించాలని అభ్యర్థించి కరపత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సాంబయ్య, పవన్‌కుమార్, సుబ్రమణ్యంరెడ్డి, మునిరాజమ్మ, రమేష్‌కుమార్‌పాల్గొన్నారు.

పిల్లలకు రుచికరమైన భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఆయన సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకోవాలని ఎంఈఓను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు అరణి విద్యానాథరెడ్డి, ఎంఈవో రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి పాల్గొన్నారు.

కలంకారీ చిత్రపటం అందజేత



కలంకారీ చిత్రపటాన్ని అందజేస్తున్న రమేష్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి పట్టణానికి చెందిన కలంకారీ కళాకారుడు రమేష్ సోమవారం కలంకారీ చిత్రాన్ని అందజేశారు. దీనిని ఆలయ ఈఓ సాగర్‌బాబు స్వీకరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్వామివారికి ప్రియ భక్తుడైన కన్నప్ప చరిత్రను తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఆలయానికి అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని పెద్ద కనపర్తి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం మాస్టర్ ట్రైనర్ హేమలత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులు ప్రధాన పంటకు 40 రోజుల ముందుగానే కనీసం 18 రకాల నవధాన్యాలను భూమిలో చల్లుకుని ఏపుగా పెరిగిన తరువాత కలియదున్నుకోవడంతో భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి, రైతులు ఖర్చులు తగ్గించే దిశగా అడుగులు వేయాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంతో పురుగులు, తెగుళ్లను తక్కువ ఖర్చుతో సులభంగా నివారించుకోవచ్చని తెలిపారు రసాయన ఎరువులు, పురుగు మందులు అధిక వినియోగంతో మనుషులు పలు రకాల అనారోగ్యాలకు గురి అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశ్వర్, పవిత్ర, రామకృష్ణయ్య, తిరుపాల్, సౌందర్య బాబు, భ్రమరాంబ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం, నిందితుడిని చూపిస్తున్న అధికారులు

కేవీబీపురం: అక్రమంగా నిల్వ ఉంచిన రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణా నాయక్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు మండలంలోని కాళంగి దళితవాడలో దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా రూ.80 వేల విలువైన రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్కడ అనుమానస్పదంగా తిరుగుతున్న అదే గ్రామానికి చెందిన అశోక్ (22)ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేవీ బీపురం ఆర్ఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి బియ్యాన్ని సీజ్ చేసి సీఎస్ గోడౌన్‌కు తరలించారు. విజిలెన్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ జయరామిరెడ్డి, వీఆర్వో లోకేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సత్ప్రవర్తనే ఉన్నతికి దోహదం



మాట్లాడుతున్న సీఐ శివకుమార్ రెడ్డి

సత్యవేడు: సత్ప్రర్తనే విద్యార్థులు ఉన్నతికి దోహదం చేస్తుందని, క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల ఆశయాలు సాధించాలని సీఐ శివకుమార్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా వార్సోవాలను పురస్కరించుకుని సోమవారం డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బాలికలకు హక్కులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంతోపాటు మహిళా సాధికారత, సామాజిక, ఆర్థిక, క్రీడా రంగాల్లో ప్రోత్సాహం ఇస్తోందన్నారు. వాటిని అందిపుచ్చుకుని రాణించాలని సూచించారు. మహిళా పోలీసులు చంద్రకళ, సుకన్య, నిహారిక, ప్రత్యూష మాట్లాడుతూ దిశా యాప్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ప్రసన్న, వైస్ ప్రిన్సిపాల్ వసుంధరాదేవి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కాణిపాక ఆలయ పునర్నిర్మాణ దాత



ఆలయ ధ్వజస్తంభం వద్ద రామకృష్ణప్రసాద్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని సోమవారం కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ పునర్నిర్మాణ దాత రామకృష్ణ ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు హరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా వార్షికోత్సవం



క్రీడా జ్యోతితో మార్చ్ పాస్టు చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో సోమవారం ఘనంగా ఆరో క్రీడా వార్షికోత్సవం జరిగింది. ఇందులో భాగంగా ప్రధానోపాధ్యాయులు కిరణ్‌కుమార్, మేనేజర్ ఆచారి క్రీడాపతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థులు వివిధ రకాల విన్యాసాలతో అలరించారు. 100, 200, 400 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు.

బాతులకు పరీక్షలు

సాక్షి ఎఫెక్ట్..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట పొలాల్లో మృతి చెందినవి పోనూ బతికి ఉన్న బాతులకు పశు వైద్యాధికారి మురళి ఆధ్వర్యంలో సోమవారం పరీక్షలు చేశారు. ఆదివారం 4 వేల బాతులు విష ప్రయోగంతో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాయని సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. వెంటనే స్పందించిన పాపానాయుడుపేట పశు వైద్యాధికారి సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందినవి పోను బతికి ఉన్న బాతులకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను తిరుపతికి పంపగా పారుడు రోగంతో బాతులు మృతి చెందినట్లు నిర్ధారణ జరిగిందని పశువైద్యులు తెలిపారు.

క్యూల పర్యవేక్షణ



క్యూలను పర్యవేక్షిస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉంది. దీంతో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వయంగా రద్దీ నియంత్రణకు పూనుకున్నారు. కంచు గడప వద్ద పర్యవేక్షిస్తూ భక్తులకు దర్శనం త్వరగా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. విపరీతమైన రద్దీ కావడంతో అడ్డదారుల్లో వీఐపీల పేరిట దర్శనాలకు అధికంగా వెళుతున్నారన్న ఫిర్యాదుల రావడంతో క్యూలను పర్యవేక్షించారు. అలాంటి వారిని గుర్తించి ప్రత్యేక దర్శనం టికెట్లు కొనుగోలు చేయించారు. క్యూల్లో చంటిబిడ్డల తల్లులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

9న జాబ్ మేళా

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్కే ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో ఈ నెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. రేణిగుంట సమీపంలోని డిక్సన్ కంపెనీలో ఎల్రక్టానిక్ టీవీ మ్యానుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ ఉద్యోగాల కోసం కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. 19– 30 ఏళ్ల లోపు వయస్సు కలిగి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ పాస్ గానీ ఫెయిల్ గానీ అయిన స్త్రీ పురుష అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్, మూడు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9840332850, 9640408264 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు కుంకుమార్చన

కార్వేటినగరం: మండలంలోని సురేంద్రనగరంలో ఉన్న వరదవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఉమ్మడి చిత్తూరు జిల్లా వారి ఆధ్వర్యంలో సామూహిక లక్ష్మీ కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకక్షేమం కోరి మంగళవారం ఉదయం 10.30 గంటలకు లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన చేస్తామన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



వృత్తి విద్యా పరీక్షలను తనిఖీ చేస్తున్న రఘురామయ్య

నారాయణవనం: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని పుత్తూరు డీవైఈవో రఘురామయ్య ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన సోమవారం నారాయణవనం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలించారు. పిల్లలకు పలు సూచనలు చేశారు. ప్రీ ఫైనల్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని హెచ్ఎంను ఆదేశించారు. విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టడానికి స్నేహపూరిత వాతారణాన్ని కల్పించాలని సూచించారు. వృత్తి విద్యాకోర్సుల ఉపాధ్యాయులు, ఇన్విజిలేటర్లు కోటేశ్వర రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కృష్ణమరాజు, కుసలన్నతో పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. 8వ తరగతి విద్యార్థులు ఉపయోగిస్తున్న ట్యాబులను పరిశీలించి బై జ్యూస్ యాప్‌లను ఎంతమంది, ఎంత సమయం వినియోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పాఠ శాల ప్రగతిని, విద్యా ప్రమాణాల పెంపునకు చేస్తున్న కృషిని హెచ్ఎం ఆనందబాబు వివరించారు.

రాత్రి తరగతుల పరిశీలన

సత్యవేడు: మండలంలోని జోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న రాత్రి తరగతులను సోమవారం రాత్రి డీవైఈఓ రఘురామయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీతోపటు మంచి కార్పొరేట్ కళాశాలలకు ఎంపికయ్యే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం 10వ తరగతి పరీక్షకు కేటాయించిన గదులను పరిశీలించారు. కేంద్రంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, మరుగుదొడ్డి, నీటి వసతి వివరాలను ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఉపాధ్యాయులు సురేష్, మునిచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు విరివిగా పనులు కల్పించాలి



పనులు పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధిహామీ పథకంలో కూలీలకు విరివిగా పనులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని ఇసుకతాగేలి, సీతారాంపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. కూలీల హాజరు పరిశీలించారు. రోజుకు రూ.257 వేతనాలు వస్తున్నాయని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మార్చి 31 నాటికి పనులకు వచ్చే ప్రతి కుటుంబానికి వంద రోజులు పూర్తి చేయాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. క్షేత్ర సహాయకులు టార్గెట్‌ను అధికమించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల వ్యవసాయ పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. ఎన్ఎంఎస్ యాప్ ద్వారా కూలీల మస్టర్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు మనోహర్, క్షేత్ర సహాయకురాలు నీలావతి, సరిత, కూలీలు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీ వాసుల సమస్యల పరిష్కారం



అగ్రకులాలవారితో మాట్లాడుతున్న ఒడిత్యా శంకర్ నాయక్

రేణిగుంట: మండలంలోని ఆర్‌మల్లవరం ఎస్టీ కులస్తులు, అగ్రవర్ణాలకు మధ్య నెలకొన్న సమస్యను రాష్ట్ర ప్రభుత్వ ఎస్టీ కమిషన్ సభ్యుడు ఒడిత్యా శంకర్ నాయక్ సోమవారం పరిష్కరించారు. భూవివాదంపై ఎస్టీ కులానికి చెందిన ధరణి మరికొంతమందిపై అగ్రకులానికి చెందిన వారు దాడి చేశారంటూ ఆదివారం గిరిజనులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఆదివారం రాత్రంతా పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించారు. సమాచారం అందుకున్న శంకర్ నాయక్ సోమవారం అక్కడకు చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. గిరిజనుల ద్వారా సమస్యను తెలుసుకుని ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ బాబ్జిరెడ్డి, గ్రామపెద్ద హరిరెడ్డికి వివరించారు. ఇరు వర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

కనుల పండువలా ఊంజల్‌సేవ



ఊంజల్‌సేవ చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ఊంజల్‌సేవ కనులపండువలా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు విశేషాలంకరణ చేశారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపుగా ఊంజలసేవ మండపానికి వేంచేపు చేశారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ ఊంజల్‌సేవ నిర్వహించారు. వెన్నెల కాంతుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.